క్లుప్తంగా

150 మంది బాలలు, వృద్ధులకు నేత్ర వైద్య పరీక్షలు



వక్కపట్లవారిపాలెం(నాగాయలంక): స్థానికంగా 150 మంది బాలలు, వృద్ధులకు నేత్ర వైద్య పరీక్షలు చేశారు. అంబటి ఫౌండేషన్ నిర్వాహకులు నిర్మలాదేవి, భరత్‌రామ్, పావని ఆర్థిక సౌజన్యం(రూ.1.50లక్షలు)తో వక్కపట్లవారిపాలెం సర్పంచ్ అంబటి శ్యామ్‌ప్రసాద్, నాగాయలంక సాయిదుర్గా ఐ క్లినిక్ అండ్ ఆప్టికల్స్ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం పంచాయతీ కార్యాలయం వద్ద బాలలు, వృద్ధులకు నేత్ర వైద్య పరీక్షలు జరిగాయి. వైద్య శిబిరాన్ని దివిసీమ గ్రామీణ యువజన వికాస సమితి అధ్యక్షుడు, జనసేన నేత మండలి వెంకట్రామ్(రాజా) ప్రారంభించారు. వృద్ధుల్లో 26 మందికి ఉచిత క్యాటరాక్ట్ ఆపరేషన్లకు ఎంపిక చేశారు. 109 మంది పిల్లల్లో 74మందికి కళ్లజోళ్ల అవసరాన్ని గుర్తించారు. క్లినిక్ అధినేత పూషడపు వెంకట రామారావు, డాక్టర్ సతీష్, డాక్టర్ శరత్, డాక్టర్ ఎం.రేఖనా పరీక్షలు చేశారు.

ఆహార పొట్లాల అందజేత



మచిలీపట్నంటౌన్: మిలాద్ ఉన్ నబి సందర్భంగా నగరంలోని ముస్లింలకు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి నేత్ర విభాగాధిపతి జి. భానుమూర్తి సోమవారం అన్నదానం చేశారు. ముస్లింలకు ఆహార పొట్లాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మిలాద్ ఉన్ నబి పురస్కరించుకుని ముస్లింలకు సేవా కార్యక్రమాలు నిర్వహించామన్నారు. కార్యక్రమంలో పలువురు ముస్లిం పెద్దలు పాల్గొన్నారు.

26 నుంచి విద్యార్థులకు పోటీలు



మచిలీపట్నంటౌన్: శ్రీ సత్యసాయిబాబా 100వ జన్మదిన వేడుకల్లో భాగంగా సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి వ్యాసరచన పోటీలు ఈ నెల 26, 27, 30 తేదీల్లో నిర్వహిస్తారని సత్యసాయి సమితి కన్వీనర్ పోతుకూచి ఆంజనేయకుమార్ తెలిపారు. సోమవారం పోటీల కరపత్రాలను మచిలీపట్నం డీవైఈవో బీఎస్‌ఈ శేఖర్‌సింగ్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఆంజనేయకుమార్ మాట్లాడుతూ పోటీల్లో మచిలీపట్నం పరిసర ప్రాంతాల్లోని విద్యాసంస్థలు, కళాశాల విద్యార్థులకు పోటీలు నిర్వహిస్తారన్నారు. మొదటి కేటగిరీలో 8, 9, 10 తరగతి విద్యార్థులు, ద్వితీయ కేటగిరీలో ఇంటర్మీడియట్, పాలిటెక్నిక్, ఐటీఐ విద్యార్థులు, మూడో కేటగిరీలో డిగ్రీ, ఇంజినీరింగ్, మెడికల్, బీఈడీ, డీఈడీ విద్యార్థులు పాల్గొనవచ్చన్నారు. కార్యక్రమంలో సమన్వయకర్తలు పి.కల్యాణి, వరప్రసాద్, వెంకట చిన్నయ్యగుప్తా తదితరులు పాల్గొన్నారు.

పెట్రోల్ బంక్‌లో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్



పెడన: పెడన, గుడివాడ రహదారిలోని పల్లోటి స్కూలు అవతల పక్కన ఉన్న హెచ్‌పీ బంకులో ఆదివారం రాత్రి అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. సిబ్బంది అప్రమత్తం కావడంతో పాటు అందుబాటులో ఉన్న గ్యాస్ సిలిండర్లు, ఇసుకతో మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. అనంతరం అగ్నిమాపక సిబ్బంది వచ్చి పూర్తిస్థాయిలో మంటలను అదుపులో ఉన్నాయని గుర్తించి వెనుదిరిగారు. ఘటనపై సోమవారం విద్యుత్ శాఖాధికారులు పెట్రోల్ బంక్ వద్దకు వెళ్లి కారణాలను అన్వేషించారు. ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఎలుక విద్యుద్ఘాతానికి గురై కరెంట్ రివర్స్‌లో పాస్ కావడంతో బంకులో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ అయినట్లు గుర్తించి నివేదికను తయారు చేసి పంపినట్లు విద్యుత్ ఏఈ జయరాం తెలిపారు.

వైరల్ జ్వరాలు వ్యాపించకుండా చర్యలు

బంటుమిల్లి: నాగేశ్వరరావుపేట పంచాయతీ పరిధిలో అంటువ్యాధులు ప్రబలకుండా పంచాయతీ ఆధ్వర్యంలో సోమవారం సున్నం, బ్లీచింగ్ పిచికారీ చేశారు. నాగేశ్వరరావుపేట, లక్ష్మీనారాయణపురం, జానకీరామపురం, గార్లగుంట గ్రామాల్లో వైరల్ జ్వరాలు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకున్నట్లు పంచాయతీ కార్యదర్శి సుబ్రహ్మణ్యం తెలిపారు.

నిమజ్జన కోలాహలం

- వినాయకుడికి ప్రత్యేక పూజలు
- సందడిగా ఊరేగింపులు

చిలకలపూడి(మచిలీపట్నం): వినాయక విగ్రహాల నిమజ్జనాలు కోలాహలంగా జరిగాయి. చవితి నవరాత్రుల్లో భాగంగా సోమవారం అట్టహాసంగా గణేష్ నిమజ్జన కార్యక్రమాలు నిర్వహించారు. మండల పరిధిలోని సత్రంపాలెం, తాళ్లపాలెం బీచ్‌లలో గణనాథుడి విగ్రహాలను నిమజ్జనం చేశారు. మండల పరిధిలోని పలు గ్రామాల భక్తులు ట్రాక్టర్లు, లారీల ద్వారా విగ్రహాలను సముద్రతీరానికి తీసుకువచ్చి నిమజ్జనం చేశారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బీచ్ వద్ద పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. రాబర్ట్‌సన్‌పేట సీఐ కె.ఏసుబాబు, మెరైన్ ఎస్సై బోసు, పోలీస్ సిబ్బంది నిమజ్జన కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

- **మచిలీపట్నంటౌన్:** నగరంలోని నాగులేరు కాలువలో కొంతమంది పందిరి నిర్వాహకులు.. గణనాథులను నిమజ్జనం చేయగా మరి కొంత మంది మంగినపూడి బీచ్‌కు తరలించారు. దీంతో ఉదయం నుంచి సాయంత్రం వరకు వీధులు సందడిగా మారాయి.

మణిదీపేశ్వరి పారాయణం

నాగాయలంక: గ్రామంలోని ప్రసన్నగణపతి దేవస్థానం ఆధ్వర్యాన జరుగుతున్న చవితి మహోత్సవాల్లో పదో రోజు సోమవారం ఉత్సవ వేదికపై అంబా సాయి కిరణ్‌శర్మ బ్రహ్మత్వంలో సువాసినిలతో మణిదీపేశ్వరి (భువనేశ్వరి)స్తోత్ర పారాయణం, సామూహిక పూజ ఘనంగా జరిగింది. స్థానిక సంకర్షణ భజన మండలి అధ్యక్షురాలు చిట్టా వాణి నేతృత్వంలో సభ్యులు మణిదీపేశ్వరి వర్ణన సామూహిక పారాయణం చేశారు.
యాగశాలలో కొక్కిగడ్డ సోమశేఖర్, రమాదేవి దంపతులు లక్ష్మీగణపతి హోమం చేశారు. మధ్యాహ్నం తాడేపల్లిగూడెంకు చెందిన కె.శారద భాగవతారిణి గానం చేసిన హరికథ భక్తులను ఆకట్టుకుంది. విద్వాన్ బ్రహ్మశ్రీ పాలపర్తి ఆంజనేయులు వయోలిన్, విద్వాన్ నగధరరావు(తెనాలి) మృదంగం సహకారం అందించారు.



బంటుమిల్లి రజకవీధిలో గణనాథుడి గ్రామోత్సవం

మర్రిపాలెం(నాగాయలంక): మర్రిపాలెం వినాయక మండపంలో స్వామివారి 15 కేజీల లడ్డూ ప్రసాదానికి వేలం పాట నిర్వహించగా గ్రామస్తుడు మద్ది వీరరాఘవయ్య(మెరుపునాయుడు) రూ. 10 వేలకు దక్కించుకున్నారు. దాత గుండు శ్రీనివాస్, ఆధ్యాత్మిక గురువు జవీవీ ప్రసాద్, బండ్రెడ్డి అవినాష్ తదితరులు పాల్గొన్నారు

బంటుమిల్లి: స్థానిక రజక వీధి, సబ్ రిజిస్ట్రార్ వారి కార్యాలయం వద్ద నిలిపిన గణనాథులను పలు వాహనాలపై ఉంచి మేళతాళాలు, కనకతప్పెట్లు, డీజే పాటలతో యువకుల కేరింతలతో పుర వీధుల్లో గ్రామోత్సవము నిర్వహించి బంటుమిల్లి ప్రధాన కాలువలో నిమజ్జనం చేశారు. ఎస్ఐ గణేష్‌కుమార్ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

పెడనలో..

పెడన: బస్టాండ్ వద్ద క్షిప్రసిద్ధి వినాయకుడి మందిర వద్ద ఏర్పాటు చేసిన గణపతిని కావిడి ఊరేగింపుగా తీసుకెళ్లారు. మహిళలు, బాలబాలికలు కోలాటం, దీపాలతో ప్రదర్శన ఆకట్టుకున్నాయి. దక్షిణ తెలుగుపాలెంలోని గణపతి ఊరేగింపు అత్యంత కోలాహలంగా నిర్వహించారు.



బందరులో నిమజ్జనానికి తరలివెళ్తున్న విఘ్నాధిపతి

- **కొడాలి(ఘంటసాల):** కొడాలి ఎస్సీ కాలనీ కమ్యూనిటీ హాలు ప్రాంగణంలో జీఎన్నాఆర్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వినాయక చవితి ఉత్సవాల్లో సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. భజన బృందం గురువు ప్రభాకర్‌ను జీఎన్నాఆర్ యూత్ ఘనంగా సన్మానించారు.



మంగినపూడి బీచ్ వద్ద వినాయక విగ్రహ నిమజ్జన దృశ్యం



పెడన బస్టాండు వద్ద కావడి ఊరేగింపుగా నిమజ్జనానికి తీసుకువెళ్తున్న భక్తులు



ఉత్సవ వేదికపై మణిదీపేశ్వరిదేవి వర్ణన పారాయణం చేస్తున్న మండలి సభ్యులు

పెదప్రోలు(మోపిదేవి): పెదప్రోలులో చవితి పందిరి వద్ద సోమవారం అన్నసమారాధన చేశారు. ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ తనయుడు మండలి వెంకట్రామ్ తొలుత స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం అన్నదానం ప్రారంభించారు. మత్తి శ్రీనివాసరావు, రాయపూడి వేణుగోపాల్, గుడివాక శివరావు, బాచు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వ్యాధులు ప్రబలకుండా వైద్యశిబిరాలు

నాగాయలంక: వరద ముంపు ప్రాంతాల్లో వ్యాధులు ప్రబలకుండా ఉచిత వైద్యశిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ కృష్ణా జిల్లా చైర్మన్ డాక్టర్ టీఎస్ఎస్ బాలాజీ చెప్పారు. నాగాయలంకలో సోమవారం పర్యటించిన ఆయన శ్రీరామ పాదక్షేత్రం ఘాట్ వద్ద మాట్లాడారు. ప్రస్తుతం వైద్య శిబిరాలు నిర్వహణ తదితర అంశాలపై స్థానిక జట్లతో చర్చించడానికి వచ్చినట్లు తెలిపారు. వరదల నేపథ్యంలో దివిసీమలో ముంపునకు గురైన పలు మండలాల్లోని బాధితులకు జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ నుంచి టార్పాలిన్‌లు, వంట పాత్రల కిట్‌లు, హైజిన్ కిట్లు, వాటర్ బాటిల్స్ సమకూర్చి సమున్నతమైన సేవలు అందించామన్నారు. రెడ్‌క్రాస్ నాగాయలంక సబ్ బ్రాంచి చైర్మన్ భోగాది శివవిష్ణువర్ధన్ చేస్తున్న సేవలను బాలాజీ అభినందించారు. రెడ్‌క్రాస్ జిల్లా మేనేజర్ భవిరి శంకరనాథ్, కోశాధికారి కె.రామ్‌బాలాజీ, డిజాస్టర్ మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యుడు కృష్ణప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అనుమతి లేని ఇసుక ట్రాక్టర్ అప్పగింత

నాగాయలంక: స్థానికంగా అనుమతులు లేకుండా తుంగలవారిపాలెం నుంచి ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను నిలిపేసి తహసీల్దార్ కార్యాలయానికి అప్పగించినట్లు ఎస్.ఐ. కలిదిండి రాజేష్ సోమవారం తెలిపారు. వచ్చిన సమాచారం మేరకు సిబ్బందితో వెళ్లి రేమూవారిపాలెం వద్ద మెయిన్ రోడ్డు పై ట్రాక్టర్ యజమాని, డ్రైవర్ రేమాల సుబ్రహ్మణ్యం ఇసుక తోలుతుంటే నిలిపి సంబంధిత పత్రాల కోసం తనిఖీ చేయగా అక్రమంగా ఇసుక తరలిస్తున్నట్లు గుర్తించామన్నారు. ట్రాక్టర్ డ్రైవర్ ఎలాంటి అనుమతులు చూపకపోవడంతో వాహనాన్ని తొలుత స్టేషన్‌కు తరలించామని, రికార్డు నమోదు చేసి తదుపరి చర్యల నిమిత్తం మండల మేజిస్ట్రేట్ అయిన తహసీల్దార్ కార్యాలయంలో అప్పగించామని ఎస్ఐ చెప్పారు.

నష్టం అంచనాలో నిర్లక్ష్యం!

- 'కోడూరు'లో దెబ్బతిన్న పొలాలను కూడా నమోదు చేయని అధికారులు
- లబోదిబోమంటున్న రైతులు

కోడూరు: పంట నష్టం అంచనాలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించారనే విమర్శలు వస్తున్నాయి. దెబ్బతిన్న పొలాలను చూసి రైతులు లబోదిబో అంటుంటే అధికారులు మీనమీషాలు లెక్కిస్తున్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మండలంలోని అనేక ప్రాంతాల్లో వరి పొలాలు ముంపుబారిన పడ్డాయి. వీటికి తోడు వరదలు కూడా రావడంతో అన్ని ప్రధాన డ్రైనేజీలు ఎగతట్టి పొలాల్లో నీరు నిలిచిపోయింది. వరద నీరు గ్రామాల్లోకి రాకుండా ఉల్లిపాలెం, పాలకాయతిప్ప గ్రామాల్లో లింగన్నకోడు డ్రెయిన్‌పై ఉన్న అవుట్‌ఫాల్ స్లూయిజ్‌లను కూడా అధికారులు మూసివేశారు. దీంతో పంట నష్టం మరింత ఎక్కువైంది. ఈ ప్రభావంతో మండలంలోని మందపాకల, పాదాలవారిపాలెం, హంసలదీవి, దింటిమెరక, ఊటగుండం, రామకృష్ణాపురం గ్రామాల్లో వందలాది ఎకరాలు ముంపు బారిన పడి దెబ్బతిన్నాయి. పొలాల్లో సుమారు వారం రోజులకు పైగా నీరు ఉండటంతో వరిదుబ్బులు కుళ్లిపోయి పంటకు నష్టం వాటిల్లింది. మందపాకల సెంట్రల్ ఛానల్ పరిధితో పాటు లింగారెడ్డిపాలెం, దింటిమెరక దిగువన, హంసలదీవి, రామకృష్ణాపురం ప్రాంతాల్లో పంటకు తీవ్ర నష్టం వాటిల్లింది.



మందపాకల సెంట్రల్ ఛానల్ పరిధిలో దెబ్బతిన్న వరి పొలం

అధికారుల మీనమేషాలు

పంట దెబ్బతిని రైతులు తీవ్రంగా నష్టపోతే అధికారులు మాత్రం నష్టం అంచనాలో మీనమేషాలు లెక్కిస్తున్నారని రైతులు వాపోతున్నారు. పంటను పరిశీలించడానికి పొలాల వద్దకు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దిగువ పొలాలు వర్షం వస్తే మునిగిపోతాయని, వీటికి కూడా నష్టం పరిహారం ఇవ్వాలేంటి అని దురుసుగా వ్యవహరిస్తున్నారని మండిపడుతున్నారు. వరి నారుమళ్లు దెబ్బతినడంతో మళ్లీ వాటిని పోసుకోవాల్సిన పరిస్థితి నెలకొందని రైతులు అంటున్నారు.

> **పంట దెబ్బతిన్నా నమోదు చేయలేదు**
>
> 
>
> మందపాకల సెంట్రల్ ఛానల్ పరిధిలో మూడు ఎకరాల పొలం ఉంది. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పంట పూర్తిగా దెబ్బతింది. దుబ్బులు కుళ్లిపోయి పంటకు నష్టం కలిగింది. దెబ్బతిన్న పొలాన్ని పరిశీలించాలని వ్యవసాయ, రెవెన్యూ అధికారులను కోరినా వారు పట్టించుకోలేదు. పంట నష్టాన్ని అంచనా వేయకుండా దురుసుగా వ్యవహరిస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి వెంటనే దెబ్బతిన్న పంటను నమోదు చేసి నష్టపరిహారం అందించాలి.
>
> –అరవ వెంకటకృష్ణ, రైతు, మందపాకల

జిల్లా కోర్ట్ రోడ్డులో ఆక్రమణల తొలగింపు

మచిలీపట్నంటౌన్: జిల్లా కోర్టు రోడ్డులో ఆక్రమణల తొలగింపునకు మున్సిపల్ అధికారులు ఎట్టకేలకు చర్యలు తీసుకున్నారు. ఈ దారిలో ఉన్న దుకాణదారులు వారి షాపుల ముందు సిమెంట్‌తో చప్టాలు ఏర్పాటు చేసి మార్జిన్‌ను ఆక్రమించారు. అక్కడకు వచ్చే వినియోగదారులు వారి వాహనాలను రోడ్డుపై నిలుపుతున్నారు. దీంతో ట్రాఫిక్ ఇక్కట్లు ఎదురవుతున్నాయి. ప్రధానంగా ఆ రోడ్డులో జిల్లా కోర్టుకు ప్రతి రోజూ న్యాయమూర్తులు, న్యాయవాదులు, కక్షిదారులు, నగర ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. ఈ ప్రాంతంలోని పోలీస్ క్వార్టర్‌ల స్థలం ముందున్న రోడ్డు మార్జిన్‌లో బడ్డీలు పెట్టుకుని వివిధ రకాల వ్యాపారాలు చేస్తున్న వ్యాపారులు సైతం మార్జిన్‌ను ఆక్రమించి చప్టాలు ఏర్పాటు చేశారు. నగర కమిషనర్ బాపిరాజు ఈ ఆక్రమణల తొలగింపుపై దృష్టి సారించారు. సోమవారం ఉదయం నుంచి ఈ రోడ్డుకు ఇరువైపులా ఉన్న మార్జిన్‌లోని చప్టాలను పొక్లయినర్‌తో తొలగించే పనులు చేపట్టారు.



జిల్లా కోర్ట్ రోడ్డు మార్జిన్‌లో ఆక్రమణలను తొలగిస్తున్న పొక్లయినర్

పూడికతీత పనులు

ఈ రోడ్డు వెంట ఉన్న డ్రెయిన్‌లో ఇక్కడి వ్యాపారులు కూరగాయల ట్రేలు, తాగి పడేసిన కొబ్బరి బోండాలు వేసి మురుగునీటి పారుదలకు ఆటంకం కలిగిస్తున్నారు. దీంతో డ్రెయిన్‌లో పూడికతీత పనులు చేపట్టారు.

రంగనాయకస్వామి పవిత్రోత్సవాలు ప్రారంభం

మచిలీపట్నంటౌన్: నగరంలోని రాబర్ట్‌సన్‌పేట శ్రీ భూనీలాపరివారసమేత శ్రీ రంగనాయకస్వామి పవిత్రోత్సవాలు సోమవారం అత్యంత భక్తి శ్రద్ధలతో ప్రారంభమయ్యాయి. ఉదయం విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, కంకణారాధన, దీక్షా స్వీకరణ, రుత్విగ్వరణం తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమాలను ఈవో కందుల వేణుగోపాలరావు పర్యవేక్షించారు.

ప్రజలు సుభిక్షంగా జీవించాలి

మచిలీపట్నంటౌన్: నగరంలోని ముస్లింలు మహ్మద్ ప్రవక్త జన్మదినాన్ని (మిలాద్ ఉన్ నబీ) సోమవారం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. ముస్లింలు నూతన వస్త్రాలను ధరించి నగరంలోని పలు మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. ద్విచక్రవాహనాలకు జెండాలను కట్టుకుని నగరంలో కలియతిరిగారు. ఇనుగుదురుపేటలోని జామియా మసీదులో ప్రార్థనల అనంతరం మిలాద్ ఉన్ నబీ కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం స్థానిక చింతచెట్టు సెంటరు నుంచి ప్రధాన రహదారుల గుండా శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు షేక్ సలార్‌దాదా, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ షేక్ అచ్చెబా, వైఎస్సార్ సీపీ మైనార్టీ విభాగం నాయకులు షేక్ మొహమ్మద్ సాహెబ్, ఇక్బాలీ, సద్‌రుద్దీన్, టీడీపీ నాయకులు కొనకళ్ల నారాయణరావు, బుల్లయ్య, సయ్యద్ ఖాజా, ఇలియాస్‌పాషా, జామియా మసీదు అధ్యక్షుడు ఎండీ అంజత్‌పాషా, కాంగ్రెస్ నాయకుడు అబ్దుల్ మతీన్ తదితరులు పాల్గొన్నారు. రాత్రి కోనేరుసెంటర్‌లో వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన మత గురువులు పండుగ విశిష్టతను వివరిస్తూ బహిరంగ సభ నిర్వహించారు. స్థానిక అజ్మీర్ బాబా సేవా సమాజం ఆధ్వర్యంలో వైజ్‌మెన్ క్లబ్ ప్రతినిధి నున్న సత్యప్రసాద్ జెండాను ఆవిష్కరించారు. సేవాసమాజం నిర్వాహకుడు సయ్యద్‌పీర్ పాల్గొన్నారు. విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు అందజేశారు. డాక్టర్ నాగేశ్వరరావు, సయ్యద్ బాజీ, షేర్ అలీ పాల్గొన్నారు.

పెడన: అల్లా.. కరుణ, కృపతో ప్రజలంతా సుభిక్షంగా జీవించాలని పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ అన్నారు. మిలాద్ ఉన్ నబీ సందర్భంగా సోమవారం పెడన – గుడివాడ రోడ్డులోని పెద్ద మసీద్ నుంచి మిలాద్ ఉన్ నబీ కమిటీ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో ముస్లిం పెద్దలు, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



మిలాద్ ఉన్ నబీ ర్యాలీలో ఎమ్మెల్యే కృష్ణప్రసాద్



బంటుమిల్లి పురవీధుల్లో ర్యాలీ చేస్తున్న ముస్లింలు

బంటుమిల్లి: స్థానిక జామియా మజీద్ కమిటీఆధ్వర్యంలో సోమవారం మిలాద్ ఉన్ నబీ ర్యాలీ ఘనంగా నిర్వహించారు. మహ్మద్ ప్రవక్త జన్మదినం సందర్భంగా ముస్లింలు ర్యాలీ చేశారు. కార్యక్రమంలో మజీద్ కమిటీ అధ్యక్షుడు, ఎంపీటీసీ ఎండీ కమాల్ బాషా, కమిటీ సభ్యులు ఎండీ బాబ్జి, ఎండీ నజీర్, బాజానీ పాల్గొన్నారు. అనంతరం ఈద్గా మైదానంలో అన్న సమారాధన జరిగింది.

ఘంటసాల: అంతర్జాతీయ అహ్మదియ్య ముస్లిం జమాతు కృష్ణాజిల్లా శాఖ ఘంటసాల చిన్న మసీదులో సంస్థ స్థానిక అధ్యక్షుడు షేక్ జాకీర్ హుస్సేన్ ఆధ్వర్యంలో మిలాద్ ఉన్ నబీ సందర్భంగా ప్రవక్త హజ్రత్ ముహమ్మద్ ముస్తఫా జీవిత చరిత్ర సమావేశం సోమవారం నిర్వహించారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనలు చేవారు. స్థానిక మౌలానా ముహమ్మద్ ఇస్మాయిల్, సంస్థ జిల్లా అధ్యక్షుడు షేక్ ఖాసిం, షేక్ అక్బర్, షేక్ అనీస్ తదితరులు పాల్గొన్నారు.

అక్కరకురాని తాగునీటి చెరువు

- తీరని తాగునీటి సమస్య
- రూ.3 కోట్లు వెచ్చించిన వైనం... పశువుల చెరువుగా రూపాంతరం
- అగమ్యగోచరంగా మల్లేశ్వరం రక్షిత మంచినీటి చెరువు విస్తరణ

బంటుమిల్లి: మల్లేశ్వరం రక్షిత మంచినీటి చెరువు విస్తరణ అగమ్య గోచరంగా మారింది. కోట్లాది రూపాయలు ఖర్చు చేసినా తాగునీటి చెరువు అక్కరకు రావడం లేదు. అది కాస్తా పశువుల చెరువుగా రూపాంతరం చెందింది. 1995లో నాటి కాంగ్రెస్ ప్రభుత్వం తీరప్రాంతవాసుల దాహార్తి తీర్చడానికి ఏర్పాటు చేసిన మల్లేశ్వరం రక్షిత మంచినీటి పథకం బహుళ ప్రజాదరణ పొందింది. ఈ పథకంపై బంటుమిల్లి, కృత్తివెన్ను మండలాల్లోని 14 గ్రామాల ప్రజలు ఆధారపడి ఉన్నారు. కాలక్రమేణా పాలకులు, నాయకుల తీరుతో అక్రమ కుళాయిలు లెక్కకు మించి ఏర్పాటయ్యాయి.
దీంతో పథకంపై పనిభారం పెరిగి తాగునీటి సరఫరా ప్రశ్నార్థకంగా మారి స్కీం కాస్త నిరాదరణకు గురైంది. ఏటా మరమ్మతులకు రూ.లక్షలు వెచ్చిస్తున్నా కాంట్రాక్టర్ల స్వార్థం, అధికారుల పర్యవేక్షణ లోపంతో పనులు నాణ్యతగా జరగలేదన్న విమర్శలు వెల్లువెత్తాయి. 30 సంవత్సరాలుగా ఈ చెరువును ఆరకట్టక(ఎండగట్టక)పోవడంతో చెరువులో మురుగు తయారై నీరు రంగుమారి దుర్గంధం వెదజల్లుతోంది.



చెరువులో తూటు, జమ్ము

ప్రజాధనం నిరుపయోగం

మల్లేశ్వరం రక్షిత మంచినీటి పథకం ద్వారా సరఫరా అవుతున్న నీరు తాగడానికి అనుకూలంగా లేకపోవడంతో చెరువును విస్తరించాలని పాలకులు, అధికారులు నిర్ణయించారు. బంటుమిల్లి గ్రామ తాగునీటి సమస్య పరిష్కారమవుతుందని భావించి 2014లో నాటి టీడీపీ ప్రభుత్వం దాదాపు రూ.2.5 కోట్లు కేటాయించి సుమారు 15 ఎకరాల భూమి కొనుగోలు చేసింది. భూమి కొన్న నాటి పాలకులు చెరువు ఏర్పాటు చేసి తాగునీరు ఇవ్వడంలో విఫలమయ్యారనే ఆరోపణలువచ్చాయి. ఈ భూమి నుంచి మట్టిని 216 జాతీయ రహదారి విస్తరణ పనులకు తరలించేశారు. దీనిని సమర్థించుకోవడానికి నీరు–చెట్టు పథకంలో ఇరిగేషన్ శాఖ ద్వారా దాదాపు రూ.20 లక్షల అంచనాలతో కట్టలు ఏర్పాటు చేయించారు. ఉపాధి పథకంలో రూ.లక్షలు ఖర్చు చేసి కూలీలతో పనులు చేయించారు.

ఊర చెరువును తలపిస్తోంది

ప్రస్తుతం చెరువు జమ్ము, గుర్రపుడెక్కతో ఊర చెరువును తలపిస్తోంది. గ్రామస్తులు దుస్తులు ఉతకడానికి, పశువులను కడగడానికి వినియోగిస్తున్నారు. రెండు నెలలుగా కురుస్తున్న వర్షాలతో చెరువు నిండా నీరు చేరింది. 2018లో చుట్టూ ఫెన్సింగ్ లేకపోవడంతో అలా చేరిన వర్షం నీటి గుంతల్లో పడి ఇద్దరు పసిపిల్లలు మృతి చెందిన సంఘటన కూడా చోటు చేసుకుంది. భూమి కొనుగోలు చేసి ఏళ్లు దాటుతున్నా అధికారుల చొరవ చూపి సమస్య పరిష్కరించేందుకు ముందుకు రాకపోవడంతో మండలంలో తాగునీటి సమస్య పరిష్కారం అడుగు ముందుకు పడటం లేదు.

ఎన్డీఏ కూటమిలో అయినా....

ప్రస్తుతం ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడం భూమి కొనుగోలు చేయించిన నాటి ఎమ్మెల్యే కాగిత వెంకట్రావు కుమారుడు కృష్ణప్రసాద్ కూడా ఎమ్మెల్యే కావడంతో తండ్రి పూర్తి చేయలేని పనిని తనయుడు అయినా చేసి తాగునీటి సమస్యను పరిష్కరిస్తారని మండల ప్రజలు ఆశతో ఎదురుచూస్తున్నారు. దీనిపై ఇరిగేషన్ ఏఈఈ నాగేశ్వరరావు మాట్లాడుతూ నీరు–చెట్టు పథకంలో పనులు చేయించామని ఇంకా బిల్లులు రాలేదన్నారు. ఆర్ డబ్ల్యూఎస్ ఏఈఈ నాగేశ్వరరావు మాట్లాడుతూ మల్లేశ్వరం రక్షిత మంచినీటి పథకం కొత్త చెరువు మరమ్మతులకు రూ.40 లక్షలతో ప్రభుత్వానికి అంచనాలు పంపామని తెలిపారు.

వరద బాధితుల సహాయార్థం వితరణ

బొబ్బర్లంక(మోపిదేవి): బొబ్బర్లంక వరద బాధితులకు ప్రభుత్వ, ప్రయివేటు ఉపాధ్యాయులు, విద్యార్థులు తమ వంతుసాయంగా సోమవారం వంటపాత్రలు అందజేశారు. ముఖ్యఅతిథి ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ఉపాధ్యాయ బృందం, విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. నియోజకవర్గంలో 2,600 మంది వరద బాధితులకు రూ. 29,78,185తో వంటపాత్రలు సమకూర్చినట్లు డైరెక్టర్ ఆఫ్ గవర్నమెంట్ ఎగ్జామ్స్ దేవానందరెడ్డి తెలిపారు. బొబ్బర్లంకలోనే 350 కుటుంబాలకు వంటపాత్రలు అందించినట్లు ఆయన వివరించారు. ఎమ్మెల్యే బుద్ధ ప్రసాద్ తనయుడు, యువనేత మండలి వెంకట్రామ్, ఎంపీపీ రావి దుర్గావాణి, సర్పంచ్‌లు దొప్పలపూడి గంగాభవాని, దిడ్ల జానకీ రాంబాబు, విద్యాశాఖాధికారులు తదితరులు పాల్గొన్నారు.



బొబ్బర్లంకలో వరద బాధితులకు వంటపాత్రలు అందజేస్తున్న ఎమ్మెల్యే బుద్ధప్రసాద్

పోరాటయోధుడు ఏచూరి

బంటుమిల్లి: కేంద్రంలోని ప్రభుత్వాలు పేదలకు నష్టం కలిగించే అనేక విషయాలపై అలుపులేని పోరాటం చేసిన యోధుడు కామ్రేడ్ సీతారాం ఏచూరి అని సీపీఎం జిల్లా కార్యదర్శి కామ్రేడ్ వై. నరసింహారావు అన్నారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో సోమవారం 'ఏచూరి' సంతాపసభ నిర్వహించారు. రైతు సంఘ మండల కార్యదర్శి ఎల్. అజయ్‌ఘోష్ అధ్యక్షతన జరిగిన సభలో నరసింహారావుతోపాటు నాయకులు ఏచూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో సీపీఎం, రైతు సంఘం, ఐద్వా, సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.

నేడు శ్రీబాలపార్వతీదేవికి అష్టోత్తర శత అలంకరణసేవ

టేకుపల్లి(మోపిదేవి): మండలంలోని టేకుపల్లి గ్రామంలో వేంచేసియున్న శ్రీ బాలా పార్వతీ సమేత రామేశ్వరస్వామిదేవస్థానంలో ఈనెల 17వ తేదీ మంగళవారం ఉదయం 6.30 గంటలకు పార్వతీ అమ్మవారికి అష్టోత్తర శత అలంకరణసేవ జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. పౌర్ణమి సందర్భంగా సాయంత్రం సామూహిక కుంకుమార్చన ఉంటుందని వివరించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు.